క్లుప్తంగా

వృద్ధులు, దివ్యాంగులను ఆదుకోవాలి



నగరంపాలెం: ప్రతి ఒక్కరూ వృద్ధులు, దివ్యాంగులను ఆదుకునేందుకు ముందుకు రావాలని శ్రీహనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ కోరారు. కొత్తపేటలోని సమితి కార్యాలయంలో ఆదివారం 60 మంది వృద్ధులు, దివ్యాంగులకు 11 రకాల నిత్యావసరాలు, బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో సమితి తరుపున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు మాదాల ప్రకాష్, పోలేపల్లి వెంకట సుబ్రమణ్యం, పలకలూరి శివరావు, టి.మురళీ సాయి, కె.లీలాకర్, లహరి, ఎస్వీ రమణ పాల్గొన్నారు.

నేడు ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

నెహ్రూనగర్: ప్రజల నుంచి తాగునీటి సరఫరా, వీధి దీపాలు, ఇతర సమస్యలపై సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో అర్జీలు(ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక)స్వీకరిస్తామని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య విభాగాధిపతులు, డెప్యూటీ కమిషనర్లు, అధికారులు పాల్గొంటారని తెలిపారు. నగర ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

అలరించిన ఏ షామ్ మస్తానీ-15



నగరంపాలెం: స్థానిక మార్కెట్ సెంటర్‌లోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏ షామ్ మస్తానీ-15 హిందీ పాత సినీ గీతాల విభావరి ఆదివారం రాత్రి జరిగింది. గాయనీ గాయకులు అమ్మపండు, పూజ, శరణ్య, నందిని, హేమమాలిని, మానస, సింధు, కల్యాణ్, విజయ్‌సాయి, శ్రీనివాసరావు, ప్రత్యేక గాయనీ లలిత (పాడుతాతీయగా) పాత చిత్రాల్లోని హిందీ పాటలను ఆలపించారు. మలయాళ చిత్రం మేఘతీర్థంలోని అతి క్లిష్టమైన భావయామి అనే గీతాన్ని లలిత అద్భుతంగా ఆలపించారు. కళాకారుడు శివ మిమిక్రీ అలరించింది. 15 ఏళ్లుగా కార్యక్రమాల నిర్వహణకు సహకరిస్తున్న ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ కార్యదర్శి పి.రామచంద్రరాజును గీతాంజలి ఆర్కెస్ట్రా సంస్థ నిర్వాహకుడు అమ్మ పండు, కళాకారులు కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది సాయికృష్ణ శ్రీనివాస్, రెడ్ క్రాస్ కోశాధికారి రవిశ్రీనివాస్, దోప్పలపూడి శ్రీనివాసరావు, షూకూర్ పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు చేయూతనివ్వాలి



నగరంపాలెం: ప్రతి విద్యార్థి విద్య ద్వారా ఉన్నతంగా ఎదగాలని బొందిలి సంక్షేమ సేవ సమాజ్ అధ్యక్షుడు రాథోడ్ సుజాన్‌సింగ్ అన్నారు. పది, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన బొందిలి విద్యార్థులు 120 మందికి ఆదివారం జీటీ రోడ్డులోని శ్రీ సదాశివ ట్రైపు ఇన్‌స్టిట్యూట్‌లో ఉచితంగా నోట్ పుస్తకాలు, ప్రోత్సాహక నగదు అందించారు. ఈ సందర్భంగా రాథోడ్ సుజాన్ సింగ్ మాట్లాడుతూ భవిష్యత్తులో మంచి ఉద్యోగాలలో స్థిరపడాలన్నారు. తద్వారా మరి కొంతమంది ప్రతిభ ఉన్న విద్యార్థులకు చేయూతనందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైల్వే విశ్రాంత ఉద్యోగి రామకృష్ణ సింగ్, సమాజ్ కార్యదర్శి శ్రీనివాససింగ్, సంయుక్త కార్యదర్శి నిర్మల్ సింగ్, సభ్యులు నరేంద్రనాథ్ సింగ్, రూప్‌సింగ్, బాలాజీసింగ్, శంకర్ సింగ్, లాలా ప్రసాద్ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

తెనాలిరూరల్: ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని ఐతా నగర్‌కు చెందిన షేక్ ఆషా(34) ఆదివారం సాయంత్రం తన ఇంటిలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అయితే ఆమెకు తెలిసిన వారితో వివాదం కారణంగా ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న టూ టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

చెరిగిపోనిదీ బంధం..చిరకాలం

పెళ్లంటే నూరేళ్ల పంట.. జీవితంలో అదో మధుర ఘట్టం. వైవాహిక బంధంలో ఒక్కటయ్యే జంట మధుర స్మృతులను పదికాలాల పాటు దాచుకునేందుకు ఫొటోలు, వీడియోలు తీయించుకోవడం సాధారణం.. నేడు పెళ్లి వేడుకలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ప్రధానంగా ప్రీ వెడ్డింగ్ షూట్లకు కాబోయే దంపతులు ప్రాధాన్యమిస్తున్నారు. మధుర స్మృతుల కోసం రకరకాల పద్ధతుల్లో ప్రీ వెడ్డింగ్ షూట్లు ప్లాన్ చేసుకుంటున్నారు. పెళ్లి వేడుకల్లో వాటిని స్క్రీన్‌లపై ప్రదర్శిస్తూ ఆహూతులకు ఆనందాన్ని పంచుతున్నారు.

- ట్రెండింగ్.. ప్రీ వెడ్డింగ్ షూట్
- వివాహ వ్యవస్థలో భాగమవుతున్న నూతన సంప్రదాయం
- సరికొత్త లోకేషన్లలో.. మధుర స్మృతులు నిర్మితం
- యువతీ యువకుల్లో పెరుగుతున్న ఆదరణ
- అభిరుచికి తగ్గట్లు ఖర్చుకు వెనుకాడని కాబోయే జంటలు
- ప్రత్యేకంగా స్టూడియోలు ఏర్పాటు



ప్రీ వెడ్డింగ్ ఫొటోలు తీయించుకుంటున్న జంటలు



నెహ్రూనగర్: ఒకప్పుడు నిశ్చితార్థం, పెళ్లి, రిసెప్షన్లకు సంబంధించి ఫొటోలు, వీడియోలను తీయించుకుని ఆల్బం తయారు చేయించి జ్ఞాపకాలుగా భద్రపరచుకునేవారు. ఇప్పుడు వాటిని అదనంగా ప్రీ వెడ్డింగ్ షూట్లు వచ్చి చేరాయి. పెళ్లికి ముందే వధూవరులు రకరకాల దుస్తులు ధరించి, సినిమాలను తలపించేలా ఫొటోలు, వీడియోలు తీయించుకునేందుకు ఇష్టపడుతున్నారు. తమ స్థాయికి తగ్గట్టుగా ప్రీ వెడ్డింగ్ షూట్ కోసం ఫొటో, వీడియోగ్రాఫర్లను మాట్లాడుకుంటున్నారు. ఇండోర్, ఔట్ డోర్ షూటింగ్‌లకు వెళ్తున్నారు. కొత్త ట్రెండ్‌కు తగ్గట్టుగా ఫొటో, వీడియోగ్రాఫర్లు ఖరీదైన కెమెరాలను వాడుతున్నారు. షూట్‌ల కోసం స్టూడియోలు సైతం వెలుస్తున్నాయి.

కాదేది అనర్హం.. ప్రీ వెడ్డింగ్ షూట్‌కు

ప్రీ వెడ్డింగ్ షూటింగ్ కోసం సాగునీటి ప్రాజెక్టులు, ఆటవీ ప్రాంతాలు, పొలం గట్లు, కృష్ణానదీ పరివాహక ప్రాంతాలు, జలపాతాలు ఇలా దేన్నీ వదలడం లేదు. ఫొటో గ్రాఫర్లు దూర ప్రాంతాలకు తీసువెళ్తున్నారు. రహదారుల వెంట, కొండ ప్రాంతాలు, ఏజెన్సీ ప్రాంతాల్లోనూ ప్రీ వెడ్డింగ్ షూట్లు జరుగుతున్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటుగా పలువురు వారి ఆర్థిక స్థాయికి అనుగుణంగా అరకు, ఊటీ, గోవా, సిమ్లా, వైజాగ్, బెంగుళూరుతో పాటు, హైదరాబాద్‌లోని రిసార్ట్స్, కేరళలోని పలు ప్రాంతాలనూ చుట్టి వస్తున్నారు.

షార్ట్ ఫిల్మ్‌కు తగ్గకుండా.. ఖర్చుకు వెనుకాడకుండా

ప్రీ వెడ్డింగ్ షూటింగ్‌లకు రూ.40వేల నుంచి రూ.10లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. మధ్యతరగతి యువత స్థానికంగా తక్కువ ధరలో రూ.40వేల నుంచి రూ.లక్ష వరకు వెచ్చిస్తున్నారు. ఎగువ మధ్య తరగతి, ఉన్నత స్థితిలో ఉన్నవారు ఖర్చుకు వెనకాడడం లేదు. ఫొటో, వీడియో షూటింగ్ కోసం రకరకాల కాస్ట్యూమ్స్ వినియోగిస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని గోల్కొండ కోట, అరకు వ్యాలీ, రుషికొండ, వరంగల్ ఫోర్ట్, అనంతగిరి కొండలు, తలకోన వాటర్ ఫాల్స్.. మరికొంత మంది గోవా, సిమ్లా, కశ్మీర్, కులుమానాలికి చేరుకుంటున్నారు. అక్కడ అందమైన లోకేషన్లు ఉండటంతో ఫ్లైట్ టికెట్లు బుక్ చేసుకుని ఎగిరిపోతున్నారు.

ట్రెండ్ ఫాలో అవుతున్నారు



యువత ఎప్పటికప్పుడు కొత్త ట్రెండ్‌ను ఫాలో అవుతుంది. వాళ్ల అభిరుచులకు అనుగుణంగా ఫొటోలు, వీడియోలు తీస్తున్నాం. ఎక్కడికి వెళ్తే ఫొటోలు ఎలా వస్తాయో వారికి చూపిస్తాం. ప్రస్తుతం దాదాపు అందరూ ప్రీ-వెడ్డింగ్ షూట్ ప్లాన్ చేసుకుంటున్నారు.

– సన్నీ, ఫొటోగ్రాఫర్, గుంటూరు

టీజేపీఎస్‌లో నాక్ పీర్ కమిటీ పర్యటన విజయవంతం



నాక్ పీర్ కమిటీతో కళాశాల యాజమాన్యం, కరస్పాండెంట్ బ్రహ్మం, అధ్యాపక బృందం

గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలను ఈ నెల 11, 12వ తేదీల్లో నేషనల్ అక్రిడిటేషన్ అండ్ అసెస్‌మెంట్ కౌన్సిల్ (నాక్) పీర్ కమిటీ సందర్శించినట్లు కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం తెలిపారు. ఆదివారం కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రెండు రోజుల కళాశాల సందర్శనలో భాగంగా కేరళకు చెందిన నాక్ చైర్మన్ డాక్టర్ గణేష్ చెంగలత్, మెంబర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ విలాస్ కారత్ (పుణె), సభ్యుడు డాక్టర్ వెంకటరమణ (తెలంగాణ) కళాశాలలో అకడమిక్ అంశాలతో పాటు, మౌలిక వసతులు, విద్యార్థుల ప్రగతిని పరిశీలించినట్లు చెప్పారు. కళాశాలలో అందిస్తున్న సదుపాయాలతో పాటు ప్రయోగశాలలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, సాంస్కృతిక విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారని తెలిపారు. కళాశాల సందర్శనలో నాక్ పీర్ కమిటీ పర్యటన విజయవంతంగా ముగిసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలక వర్గ అధ్యక్షుడు పోలిశెట్టి శ్యామ్ సుందర్, కోశాధికారి వి.కృష్ణానందం, కమిటీ సభ్యులతో పాటు డిగ్రీ, పీజీ ప్రిన్సిపల్స్ ఏబీపీ మనోహర్, డాక్టర్ ఎస్. అనితాదేవి, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ చంద్ర, డాక్టర్ కామేశ్వరశాస్త్రి, వైస్ ప్రిన్సిపల్ భాను మురళి, ఎన్ఎస్ఎస్ కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ రవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మధుమేహులు రెటినోపతి పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ రాచపల్లి కల్పనారెడ్డి

గుంటూరు మెడికల్: మధుమేహం మన దేహంలోని ప్రతి అవయవంపై ప్రభావం చూపుతుందని రక్తంలో అసాధారణ షుగర్ శాతాన్ని నిర్లక్ష్యం చేసిన కారణంగా చూపును కోల్పోతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంటుందని డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పిటల్ నేత్ర వైద్య శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ రాచపల్లి కల్పనారెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం స్థానిక బ్రాడీ పేటలోని ఎస్‌హెచ్‌ఓ భవనంలో ఎస్‌హెచ్‌ఓ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా నిర్వహించిన రెటినోపతి ఉచిత పరీక్ష శిబిరం -శాస్త్రీయ అవగాహన సభలో డాక్టర్ కల్పనారెడ్డి పాల్గొని ప్రసంగించారు. సభకు సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు డాక్టర్ టి.సేవ కుమార్ అధ్యక్షత వహించారు. డాక్టర్ కల్పనా రెడ్డి ప్రసంగాన్ని కొనసాగిస్తూ కంటి వెనుక భాగంలో 10 పొరలతో నిర్మితమైన రెటీనా ఉంటుందని చెప్పారు. రక్తంలోని షుగర్ శాతం అసాధారణంగా ఉండడం, ఈ అసాధారణతలలో కూడా హెచ్చుతగ్గులు ఉండడం వల్లనే అత్యంత సున్నితమైన రక్తనాళాలలో అసాధారణ మార్పులు చోటు చేసుకుంటాయని తెలిపారు. మధుమేహ బాధితుల్లో రెటీనాలో వచ్చిన ఈ విధమైన మార్పులనే 'డయాబెటిక్ రెటినోపతి'గా పేర్కొంటారన్నారు. అధిక రక్తపోటుగల వారిలో కూడా రెటినోపతి వస్తుందని దీన్ని హైపర్ టెన్సివ్ రెటినోపతీ అంటారని చెప్పారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్ మాట్లాడుతూ విద్యావంతులు చైతన్యవంతులై నేత్రదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. సభాధ్యక్షుడు డాక్టర్ టి.సేవ కుమార్ మాట్లాడుతూ జనవరి, జూలై నెలల్లో డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ సహకారంతో ఉచిత రెటినోపతిపరీక్ష శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి కె.సతీష్‌బాబు, కోశాధికారి టీవీ సాయిరాం, సీహెచ్ శివాజీ, సీహెచ్ లక్ష్మి సామ్రాజ్యం, డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ పీఆర్వో డి.సుధాకర్, సిబ్బంది ఎస్.రూప, సీహెచ్ జోత్స్న రెడ్డి, టి.శివప్రసాద్, టి.కృష్ణ, ఎస్‌హెచ్‌ఓ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌యూబీ పనులు త్వరితగతిన ప్రారంభించాలి



సీపీఐ పతావిష్కరణ చేస్తున్న నగర కార్యదర్శి మాల్యాద్రి, నాయకులు

లక్ష్మీపురం: గుంటూరు నగరంలో నెహ్రూ నగర్ నుంచి వెంకటాద్రి పేట మీదగా సంజీవనగర్ రైల్వే ట్రాక్ ఎప్పుడు రద్దీగా ఉండటం వల్ల అక్కడ రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి ఏర్పాటుపై దృష్టి పెట్టాలని సీపీఐ నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి పేర్కొన్నారు. స్థానిక వెంకటాద్రి పేట సెంటర్‌లోని సీపీఐ పతాకావిష్కరణ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ నుంచి గుంటూరు మీదుగా అనేక రైళ్లు, గూడ్స్‌లు పెరిగిందన్నారు. దీంతో ప్రతి ఐదు నిమిషాలకు ఒక రైలు వెళ్లడంతో రైల్వే గేటు వద్ద విద్యార్థులు, వివిధ పనులకు వెళ్లాల్సిన ప్రజలు నిలబడిపోవాల్సి వస్తోందన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్ ఏర్పాటు చేసిన తర్వాత ఈ బ్రిడ్జి ప్రాధాన్యత పెరిగిందని చెప్పారు. ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ గుంటూరు నగరంలోని బ్రిడ్జిలపై దృష్టి పెట్టారని ఈ ట్రాక్ ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని త్వరగా పూర్తి చేసి నగర ప్రజలకు ఇబ్బందులను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 56వ డివిజన్ కార్యదర్శి పల్ల యేసురత్నం, పాతర్ల జాన్ ,దివెన్ కుమార్, రమేష్ ,డేవిడ్ ,ఏసు, బాబు, భాస్కర్, ఏసు పాదం, రమేష్ , రాంబాబు తదితరులు పాల్గొన్నారు .

వృద్ధాశ్రమాల్లో అన్నదానం

తెనాలిఅర్బన్: శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం సభ్యులు గరికపర్తి కాశీవిశ్వనాథ్ దేవర 7వ వర్ధంతిని పురస్కరించుకుని వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గాంధీ నగర్‌లోని శిరిడి సాయి వృద్ధాశ్రమం, బుర్రిపాలెం రోడ్డులో గాంధీ శాంతి ఆశ్రమం, నాజర్ పేటలోని మన ఇల్లు వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఆదివారం అన్నదానం చేసి, పండ్లు పంపిణీ చేశారు. ఎస్వీయోగ కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య, యోగా సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఇంద్రజాల ప్రదర్శన




నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళా వేదికపై ఏపీ మెజీషియన్స్ అసోసియేషన్, అమరావతి మ్యాజిక్ ఫెస్టివల్ 40వ ఇంద్రజాల మహోత్సవాలు ఆదివారం నిర్వహించారు. తొలుత ఆలయ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మెజీషియన్స్ ఇంద్రజాల ప్రదర్శనలు ప్రేక్షకులను అబ్బురపరిచాయి. అనంతరం అసోసియేషన్ సభ్యులను దేవాలయ పాలక మండలి సత్కరించింది. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు జేవీఆర్, కార్యదర్శి డాక్టర్ ఆర్యల్, డాక్టర్ ఆర్ఎల్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆహార మార్పులు జీర్ణకోశ వ్యాధులకు మూలం



లక్ష్మీపురం: పెరిగిపోతున్న లివర్, జీర్ణకోశ వ్యాధులకు ఆహార వ్యవహారాలలో మార్పులు, వాతావరణ కాలుష్యం కారణమని ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ వీరేంద్ర యశస్వి పేర్కొన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఆరోగ్య సభలో ఆయన మాట్లాడారు. గ్యాస్ ట్రబుల్ అని భావించి ఏదో ఒక ఔషధం తీసుకొనడం వల్ల చిన్న సమస్యలు ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఆహారంలో మైదా శాతాన్ని చాలా తగ్గించాలన్నారు. నూనెలు నాణ్యత కలిగినవి ఉపయోగించాలని సూచించారు. బీపీ, మధుమేహం అదుపులో ఉంచుకోవాలని, అవి నియంత్రణలో లేకుంటే శరీరంలో అన్ని భాగాలకు కూడా నెమ్మదిగా సమస్యలు తలెత్తుతాయని వివరించారు. ఈ కార్యక్రమానికి టీవీ సాయిరాం కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించగా, విశ్రాంత పోలీస్ అధికారి హుస్సేన్, ఆరోగ్య విషయాల విశ్లేషకులు వీవీ రావు, అవగాహన సీనియర్ సభ్యులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బైక్ ఢీ కొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



బైక్ ఢీ కొని మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

పెదకాకాని: బైక్ ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన తక్కెళ్ళపాడు సమీపంలో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పెదకాకాని మండలంలోని తక్కెళ్ళపాడు సమీపంలో జాతీయ రహదారిపై మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. ఆ ప్రదేశంలో యూనికార్న్ బైక్ పడి ఉంది. రోడ్డుపై నడిచి వెళుతున్న వ్యక్తిని విజయవాడ వైపు నుంచి చిలకలూరిపేట వైపు వెళ్లే రోడ్డులో బైక్‌పై వెళుతున్న వ్యక్తి అజాగ్రత్తగా నడిపి ఢీ కొనడం కారణంగానే తీవ్రగాయాలై చనిపోయి ఉంటాడని భావిస్తున్నారు. సుమారు 35 సంవత్సరాల వయస్సు కలిగిన మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ విభాగానికి తరలించారు. తక్కెళ్ళపాడు వీఆర్‌ఏ షేక్ లాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వీరాస్వామి తెలిపారు.

జీజీహెచ్‌లో ప్లాస్టిక్ సర్జరీ డే వేడుకలు

ఎనిమిది మందికి ఆపరేషన్లు



కేక్ కట్‌చేస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ సుమితా శంకర్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో ఆదివారం ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవం నిర్వహించారు. ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ సుమిత శంకర్‌తో కలిసి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ సర్జరీ వల్ల కలిగే ప్రయోజనాలు, పురోగతి గురించి అవగాహన కల్పించే లక్ష్యంతో ఉచిత శస్త్రచికిత్స శిబిరం నిర్వహించామని తెలిపారు. ప్లాస్టిక్ సర్జరీ విభాగాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లడంలో డాక్టర్ సుమితా శంకర్ గణనీయమైన కృషి చేస్తున్నారని కొనియాడారు. ఫాసియోమాక్సిల్లరీ ట్రామా, హ్యాండ్, ఫింగర్ రీప్లాంటేషన్, ఫ్యాట్ గ్రాఫ్టింగ్, ఆంకోప్లాస్టీ , ఆర్థోప్లాస్టీ రీకన్‌స్ట్రక్టివ్ వంటి కాస్మొటిక్ సర్జరీలను జీజీహెచ్‌లో కార్పొరేట్ ఆస్పత్రుల కంటే దీటుగా పూర్తి ఉచితంగా చేస్తున్నారని తెలిపారు.

ఎనిమిది మందికి శస్త్ర చికిత్సలు

రాష్ట్రంలో అత్యధిక సంఖ్యలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులతో ప్లాస్టిక్ సర్జరీ వైద్య విభాగంలో సేవలను విస్తరిస్తున్నాని సూపరింటెండెంట్ కిరణ్ కుమార్ పేర్కొన్నారు. కాలిన గాయాలు, ప్లాస్టిక్ సర్జరీ కోసం ప్రత్యేకమైన యూనిట్లను, బ్రెస్ట్ క్లినిక్, డయాబెటిక్ ఫుట్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. వరల్డ్ ప్లాస్టిక్ డే సందర్భంగా ఆదివారం జీజీహెచ్‌లో డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య సేవా ట్రస్ట్ ద్వారా ఎనిమిది మంది రోగులకు శస్త్రచికిత్స చేశామని వెల్లడించారు. చీలిక పెదవి, సిండక్టిలీ, పోస్ట్-బర్న్ కాంట్రాక్చర్ కేసులతో పాటు, నరాల దెబ్బతినడం, ముఖ ఎముక పగుళ్లకు శస్త్ర చికిత్సలు చేస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ సుమితా శంకర్ మాట్లాడుతూ తమ వైద్య విభాగంలో 10 మందికి పైగా వైద్యులు ఉన్నారని చెప్పారు. అధునాతన కేసులకు పరిధిని విస్తరించారని ఈ విభాగం రాష్ట్రం మొత్తానికి రెఫరల్ సెంటర్‌గా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రలేఖ, డాక్టర్ పోలయ్య, డాక్టర్ రామ్ రాజు, డాక్టర్ శైలజాతో పాటు నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధికి ఉపాధ్యాయులకు శిక్షణ



ఉపాధ్యాయులతో రిసోర్స్ పర్సన్లు

గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురంలోని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల ఉపాధ్యాయులకు విజయవాడలోని సీబీఎస్ఈ ప్రాంతీయ కార్యాలయంలో శని, ఆదివారాల్లో ఎక్స్‌పీరియెన్షియల్ లెర్నింగ్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్లుగా వివా స్కూల్ ప్రిన్సిపల్ చదలవాడ సరళ, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అకడమిక్ డైరెక్టర్ ఎస్.ఉమా శ్రీనివాసరావు వ్యవహరించారు. విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని పెంపొందించడానికి బ్లూమ్స్ టాక్సానమి పద్ధతిలో ఆర్కా, ఎక్స్‌పీరియెన్షియల్ లెర్నింగ్, మల్టిపుల్ ఇంటెలిజెన్స్ తదితర అంశాల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. కళాశాల కరస్పాండెంట్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ మారుతున్న విద్యా విధానానికి అనుగుణంగా ఉపాధ్యాయులు బోధన పద్ధతులు మార్చుకునేలా, సీబీఎస్ఈ సీఓఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేసినట్లువుతుందని అభిప్రాయపడ్డారు. తమ విలువైన సమయాన్ని ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చేందుకు కేటాయించడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపల్ కర్లపూడి పార్వతీదేవి, కో-ఆర్డినేటర్లు దుర్గా శ్యామ్, శ్రీదేవి, ఉపాధ్యాయ బృందం పాల్గొంది.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

మంత్రి నాదెండ్లకు ఆర్టీసీ కార్మికుల వినతి



మంత్రి మనోహర్‌ను కలిసిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘ నాయకులు

తెనాలిరూరల్: ఆర్టీసీలో ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు విజ్ఞప్తి చేశారు. పపట్టణంలోని బోస్ రోడ్డులో ఉన్న మంత్రి కార్యాలయంలో ఏపీఎస్ ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం రాత్రి మంత్రికి సమస్యలను విన్నవించారు. అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి పి.సుధీర్‌కుమార్ మాట్లాడుతూ థర్డ్ పార్టీ విధానంలో ఆర్టీసీలో 7,300 మంది కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. ఈ విధానం వల్ల చాలా నష్టపోతున్నామన్నారు. థర్డ్ పార్టీ విధానాన్ని రద్దు చేసి, నేరుగా సంస్థ నుంచి జీతం వచ్చేలా చర్యలు తీసుకుని ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

చిరుధాన్యాలను అశ్రద్ధ చేయడమే అనారోగ్యాలకు మూలం

స్వతంత్ర శాస్త్రవేత్త డాక్టర్ ఖాదర్‌వలి



మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వలి

గుంటూరు రూరల్: మన పూర్వీకుల ఆహార అలవాట్లెన్న చిరుధాన్యాలను పక్కకు నెట్టి బియ్యం, గోధుమలు లాంటివి ఉపయోగించేలా నేటి మన జీవనశైలి మారిందని స్వతంత్ర శాస్త్రవేత్త డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. ఆదివారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతు నేస్తం ఫౌండేషన్‌లో ఏర్పాటు చేసిన సిరిధాన్యాలతో జీవనసిరి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విదేశీ ఆహారపు అలవాట్ల ఫలితమే నేడు మానవ సమాజాన్ని పట్టి పీడిస్తున్న అతి పెద్ద సమస్య అనారోగ్యమని చెప్పారు. ప్రజలు అవసరాలను పక్కకు నెట్టి అనుకరణలకు ప్రాధాన్యతనివ్వడానికి బానిసలైపోయారన్నారు. ప్లాస్టిక్ వాడకం, ప్రాసెసింగ్ ఫుడ్, జంక్ ఫుడ్ వంటివి అలవాటు చేసుకోవడంతో పాటు కృత్రిమ సౌందర్య సాధనాలను విపరీతంగా ఉపయోగించడం లాంటివి విదేశాల నుంచి మనం దిగుమతి చేసుకున్నవేనని తెలిపారు. మనలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక అనారోగ్య సమస్యతో బాధపడుతున్నామని అందుకు కారణం మన ఆహారపు అలవాట్లేనని చెప్పారు. గడచిన వందేళ్లలో మారిన జీవన విధానం, ఆహార ఉత్పత్తి పద్ధతి, తీసుకునే ఆహారంలో చోటు చేసుకున్న మార్పులే ఈ విపత్తుకి కారణమని చెప్పారు. ఈ సమస్యకు సిరిధాన్యాలు, కషాయాలే పరిష్కారమని అన్నారు. రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్షక్ సేవా సేంద్రం నిర్వహణలో సిరిధాన్యాలతో జీవన సిరి అనే కార్యక్రమాన్ని నిర్వహించటం సంతోషకరమన్నారు. 150 ఏళ్ల క్రితం మధుమేహం అంటే ఎవరికీ తెలియదని, కానీ నేడు దేశవ్యాప్తంగా ప్రతి 100 మందిలో 20-25 మంది మధుమేహంతో బాధపడుతున్నారన్నారు. పుట్టే ప్రతి 100 మంది పిల్లల్లో 10 నుంచి 15 మంది బుద్ధి మాంద్యంతో పుడుతున్నారని వివరించారు. ఈ సమస్యలన్నిటికి పోషకాలు లేని ఆహారం తీసుకోవడమే ప్రధాన కారణమని తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం సిరి ధాన్యాలతో పాటు కషాయాలను ఆహారంగా తీసుకుంటే ఆరు నెలల్లో ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. పాలు, టీ, కాఫీ, ప్లాస్టిక్ కవర్లలో, శుద్ధిచేసిన ఆహారాలను మానేయాలని సూచించారు. మధుమేహం, బీపీ, థైరాయిడ్ వంటి రోగాలను నయం చేసే శక్తి సిరిధాన్యాలకు, కషాయాలకు ఉందని వివరించారు. కార్యక్రమంలో రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు, రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.